క్లుప్తంగా

నేటి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: నేటి మధ్యాహ్నం 2.30 గంటలకు రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో పేపకాయల బాబ్జీ కల్యాణ మండపంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ పిలుపు ఇచ్చారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ


మండపేట పాఠశాలకు అందజేసిన మైక్‌సెట్‌తో ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని డాక్టర్ పాలడుగు సత్యవతి చంద్రమౌళి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రూ.15 వేలు విలువైన మైక్‌సెట్‌ను సమకూర్చారు. ఉపాధ్యాయురాలు ఎస్.మైథిలి లక్ష్మీదేవి రూ.10 వేలు, మరికొందరు ఉపాధ్యాయులు రూ.5 వేలు పాఠశాల హెచ్ఎం రాజుకు అందజేయగా ఆ మొత్తంతో మైక్‌సెట్‌ను కొనుగోలు చేశారు. దాతలకు పాఠశాల విద్యా కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతుకు మంచి భవిష్యత్తు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ

రామచంద్రపురం రూరల్: భవిష్యత్తులో గొప్ప రైతు ఎవరు అంటే ఆయిల్ పామ్ రైతని చెప్పవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ అన్నారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగిన ఆయిల్‌పామ్ మెగా మేళాలో ఆయన పాల్గొన్నారు. ఆయిల్ పామ్ రంగంలో తనకున్న అపార అనుభవంతో చెబుతున్నానని దొంగతనాలకు గురికాకుండా, ప్రకృతి వైపరీత్యాలకు లోను కాకుండా ప్రతి నెలా రెండు సార్లు ఆదాయాన్నిచ్చే పంటగా అయిల్‌పామ్‌ను అభివర్ణించారు. సంవత్సరానికి నికరంగా రూ.1.50 లక్షల ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జీఎం జె.ప్రభాకరరావు, ఏజీఎం వీరభద్రరావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ అధికారి భరతలక్ష్మి క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఏడు ట్రీట్‌మెంట్ యూనిట్లలో ప్రస్తుతం 780 మంది క్షయవ్యాధికి చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ప్రస్తుతం టీబీ వ్యాధి గల వారికి దగ్గర సంబంధం ఉన్న వారు, ఇమ్యూనిటీ తక్కువ ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులను స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. రామచంద్రపురం యూనిట్‌లో ప్రస్తుతం 124 కేసులు ఉన్నాయన్నారు. ప్రజలతో క్షయ వ్యాధి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మితో కలసి గ్రామ పెద్ద చుండ్రు సూరిబాబు, సర్పంచ్ వీరలక్ష్మి అందజేసిన పోషకాహార కిట్లు పంపిణీ చేశారు.

క్రమశిక్షణే బాలికలకు రక్షణ కవచం

రామచంద్రపురం రూరల్: క్రమశిక్షణే బాలికలకు రక్షణ కవచమని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సూచించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మానసిక నైపుణ్యాలు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలనే అంశంపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఎవరైతే గురువుల మాట వింటారో వాళ్లే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ లాంటివి ఉపయోగించవద్దని కోరారు. శక్తి యాప్ గురించి వివరించి ఉపయోగించే విధానాన్ని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శేఖర్ మాట్లాడుతూ పదో తరగతిలో అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావడానికి కృషి చేయాలని కోరారు. ఇతర ఉపయోగం లేని వ్యాపకాల జోలికి వెళ్లకూడదని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు, పీడీలు ఆని శ్రీనివాస్, ఉమ, మహిళా పోలీస్‌లు దుర్గ, శ్యామల, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలతో తస్మాత్ జాగ్రత్త

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన
- తొలకరి పనులకు సిద్ధమవుతున్న రైతులు

కాజులూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. వరి సాగులో తొలిదశ విత్తన సేకరణతోనే ప్రారంభమౌతుంది. ఈ నేపథ్యంలో విత్తనాలు కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కల్తీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టం–1985 ప్రకారం నిబంధలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. సగటున మొత్తం మీద ఎనిమిదివేల క్వింటాళ్ల విత్తనం అవసరమవగా ఇందులో రైతులే స్వచ్ఛందంగా 50 శాతం విత్తనాలు తయారుచేసుకోగా మిగిలిన విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారాను, బయట మార్కెట్‌లోనూ కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక్క కాజులూరు మండలంలో 18500 ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తుండగా ఇక్కడ 1250 క్వింటాళ్ల విత్తనాలు అవసరమౌతాయి. రైతులు స్వచ్ఛందంగా 500 క్వింటాళ్ల విత్తానాలు సిద్ధం చేసుకోగా, 50 క్వింటాళ్లు వ్యవసాయశాఖ సబ్సిడీపై రైతులకు అందజేస్తుంది. మిగిలిన 700 క్వింటాళ్లు విత్తనాలు రైతులు బయట మార్కెట్‌లో డీలర్ల వద్ద కొనుగోలు చేసుకోవలసి ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.


కాజులూరులోని ఒక విత్తన విక్రయ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు


నూటికి 90 శాతం పైబడి మొలకెత్తిన నాణ్యమైన వరి విత్తనాలు

విత్తనాల కొనుగోలులో..

బయట మార్కెట్‌ల్లో వత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సీల్ వేసిన ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తనాల రకం, ల్యాబ్ నెంబర్, గడువు తేదీ, తదితర విషయాలను గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలి. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. హైబ్రీడ్ విత్తనాల కొనుగోలుకు విత్తనరకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యునాణ్యత వంటి వివరాలు పరిశీలించాలి. మొలకెత్తిన దశ, పూతదశలో లోపం కనిపిస్తే స్థానిక వ్యవసాయ అధికారులను లేదా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలి.

మొలకలను పరీక్షించే విధానం

కొందరు రైతులు విత్తుకోవడానికి కొన్ని గంటల ముందుకాని, ఒకరోజు ముందు విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల మొలక పరీక్షలు చేయించుకోవడం లేదు. విత్తనం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా మొలకలను పరీక్ష చేయించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి అనంతరం ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలకుండా మండీ కట్టాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 80 గింజలపైనే మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని నారుమడులు సిద్ధం చేసుకోవాలి. మొలక శాతం కనీసం 75 నుంచి 80 శాతం వరకూ ఉంటే విత్తనాలు నాణ్యమైనవని భావించి పంటలు విత్తుకోవాలి.

గడువు దాటితే కొనుగోలు చేయొద్దు

కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా డబ్బాపై సీలు ఉందా? లేదా? అనేది నిర్ధారించుకోవాలి. అరువు పద్ధతిలో విత్తనాలు కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

> **మంచి విత్తనాలతోనే నారు కట్టాలి**
>
> 
>
> సొంతంగా తయారు చేసిన విత్తనాలు నారుకు శ్రేయస్కరం. కొనుగోలు చేస్తే మంచి విత్తనాలను ఎంపిక చేయాలి. నారుపోసే ముందు మొలక శాతం గుర్తించి నారుపోయాలి. ఎలాంటి సమస్యలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.
>
> – వి.అశోక్, ఏవో, కాజులూరు

ఇమాం హుస్సేన్ పరివారానికి ఘన నివాళులు

రామచంద్రపురం రూరల్: ప్రపంచ ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమాం హుస్సేన్, అతని 72 మంది పరివారానికి ద్రాక్షారామలోని ముస్లిం భక్తులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ద్రాక్షారామలో 10 రోజుల మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని 20 పంజాలలో ప్రతిరోజూ పీర్లకు పూల అలంకరణలు, ధూప, గంధ, ఫాతిహా తదితర సంప్రదాయ పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొహర్రం సంతాప దినాలు జూన్ 26 న ప్రారంభమై జూలై 6న షహదత్ వీరమరణంతో ముగియనున్నాయి. ఆయా పంజాల్లో ప్రతిరోజూ మజ్లిస్‌ల అనంతరం మాతం, పీర్ల ఊరేగింపులు, నిప్పు కణికలపై నడవడం వంటి భక్తి కార్యక్రమాల్లో ముస్లింలు నియమ, నిష్ఠలతో పాల్గొంటున్నారు. ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమనే సంఘాలు, పంజా ధర్మకర్తలు భోజన వసతి కల్పిస్తున్నారు. చలివేంద్రాల ఏర్పాటు చేశారు. లఖ్నవ్(ఫైజాబాద్) విచ్చేసిన మత గురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మజ్లిస్‌లు ఆలపిస్తున్నారు. ఆగా వారి పంజాలో 10వ రోజు తల్లి పీర్(బార్ మే ఇమాం) గుమ్మటం తీసి ఊరేగిస్తారు. భక్తులు మొక్కులు సమర్పిస్తారు.


ద్రాక్షారామలో పీర్లు ఊరేగిస్తున్న చిన్నారులు, భక్తులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలు గ్రామాల వినియోగదారులు విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు వినతి పత్రాలను అందజేశారు. విద్యుత్ సమస్యలపై సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ శాఖాధికారులతో ఎమ్మెల్యే వేగుళ్ల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను ఇప్పటికే తాను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. టేకి గ్రామానికి నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రి మంజూరు చేశారన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయ్యి వినియోగంలోకి వస్తే మండలంలోని విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా ఎలక్ట్రికల్ ఎస్ఈ రాజేశ్వరి మాట్లాడుతూ ఈ ఏడాది చివరినాటికి విద్యుత్ సమస్యలు దాదాపు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మండపేట ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, నాయకులు బోణం వెంకట శ్రీనివాస్, రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు, డీఈఈ శ్రీధర్, సబ్ స్టేషన్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కరివేపాకులా..పవన్

- 'సుపరిపాలన తొలి అడుగు'లో డీసీఎం చిత్రం మాయం
- ఎన్నికల్లో మాత్రం బాబు ష్యూరిటీకి పవన్ గ్యారంటీ
- మల్లగుల్లాలు పడుతున్న జన సైనికులు

రామచంద్రపురం రూరల్: కూటమి కట్టి అధికారంలోకి వచ్చిన టీడీపీ మెల్లగా జనసేన పార్టీకి సమాధి కడుతోందని జనసేన శ్రేణులు అంటున్నారు. రాష్ట్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో చేస్తున్న ప్రచారంలో ఇది కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని వాపోతున్నారు. ఎన్నికల ముందు 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ' అంటూ చేసిన ప్రచారంలో అడుగడుగునా టీడీపీ సింబల్‌తో పాటు చంద్రబాబు, పవన్‌ల చిత్రాలు వేసి ప్రచారం చేశారని, ఇప్పుడు పేరుకు కూటమి పాలన అంటున్నా జనసేన పార్టీని, తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ని చిన్నచూపు చూస్తున్నారని వారు వాపోతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారంలో కరపత్రాలపై జనసేన పార్టీ గుర్తు కానీ, పవన్ కల్యాణ్ చిత్రంగానీ లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

రాయవరం: దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధం సంస్థ, తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. మండలంలోని చెల్లూరు పంచాయతీ వద్ద నిర్వహించిన సమావేశంలో పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాఘువులు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తోందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి10 గంటల పని భారాన్ని మోపడం, కార్మిక చట్టాలను రద్దు చేయడం, ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పంచాయతీల్లో కనీస వేతన చట్టం అమలు జరగడం లేదన్నారు. ప్రతి కార్మికుడికి రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులకు ఈపీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫాం, సబ్బులు, నూనెలు నెలవారీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లంకా రాంబాబు, ఎం.ప్రసాద్ జయరవికుమార్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి

- ఘనంగా మన్యంవీరుడు సీతారామరాజు జయంతి వేడుకలు
- ఆయన విగ్రహాలకు నివాళులర్పించిన నేతలు

కపిలేశ్వరపురం: అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తదితర గ్రామాల్లో శుక్రవారం అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంగర అశిరాంబిక అమ్మవారి ఆలయం వద్ద, పీహెచ్‌సీ వద్ద నెలకొల్పిన విగ్రహాలకు వద్ద ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మండపేటలో...

మండపేట మండలం ద్వారపూడిలో బీజేపీ ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరాం, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అల్లూరి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు కంకటాల మురళీకృష్ణ, పాలిక రమణ, సాలాపు వీరవెంకట సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రాయవరం: గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాటాలను ప్రశంసించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరాల రాంబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చిరట్ల సుబ్బారావు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు గరగ రాంబాబు, అబ్బిరెడ్డి శాంతారావు, అంగర జనార్ధన స్వామి తదితరులు పాల్గొన్నారు.


ద్వారపూడిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు


రాయవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కూటమి మోసపు హామీలను ఎండగట్టాలి


గొల్లపాలెం సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: ఎన్నికల్లో గద్దెనెక్కేందుకు సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు కార్యకర్తలు, ప్రజలు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అన్నారు. కృష్ణమూర్తి తదితర నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ద్రాక్షారామ సాయి మాధవానంద ఫంక్షన్ హాల్‌లో జరగనున్న 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమ ప్రారంభ సభకు హాజరు కావాలని పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువకులను ఆహ్వానించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ పాలనలో తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలను తూచా తప్పకుండా అమలు చేయడమే కాకుండా ప్రజాసంక్షేమం కోసం ఎన్నికల్లో చెప్పని పథకాలు సైతం అమలు చేశారన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' పేరుతో శనివారం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్చంద్రబోస్ తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గుంటూరి అప్పారావు, ప్రధాన కార్యదర్శి యాళ్ళ సత్తిబాబు, మాత మురళి, మండల బీసీ సంఘం అధ్యక్షుడు చొల్లంగి రమణ, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెంకే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు వంగవీటి

- ఘనంగా మోహనరంగా జయంతి వేడుకలు
- ఆయన విగ్రహాలకు నివాళులర్పించిన నేతలు

కపిలేశ్వరపురం: జనం గుండె చప్పుడుగా వంగవీటి మోహన రంగా వెలుగొందారని ఎమ్మెల్సీ తోట త్రిమ్మూరులు అన్నారు. మండపేట నియోజకవర్గంలో శుక్రవారం వంగవీటి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండపేట మహనీయుల విగ్రహాల సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమ్మూరులు మాట్లాడుతూ రంగా కృషి ఓ ప్రాంతానికి పరిమితమైనది కాదని, రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు ఆయన విశేష సేవలందించారన్నారు. ఏ సమస్య వచ్చినా రంగా ఉన్నాడనే భరోసాతో ఆ రోజుల్లో సామాన్య ప్రజలు ఉండేవారన్నారు. కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా రంగా వెలుగొందారని కొనియాడారు. రంగా విగ్రహాన్ని మండపేట పట్టణంలో ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాపు సంఘం నాయకుడు జిన్నూరి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మండపేట రూరల్ గ్రామాల్లో..

కేశవరంలోని రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు సలాది శివ, అల్లంపల్లి కిశోర్, కూసు దొరాజీ, కుర్రా రవి, ముక్కపాటి రాజు, చిన్నబాబు రంగా కృషిని వివరించారు. మండపేట పట్టణంలోని మహనీయుల విగ్రహాల సెంటర్‌లో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

కపిలేశ్వరపురం మండలంలో..

మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కోరుమిల్లి, కేదారిలంక, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో శుక్రవారం రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. అంగర గాంధీ సెంటర్‌లో కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేడేపల్లి కనకరామకృష్ణ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి నివాళులర్పించారు. మత్సా గంగరాజు, తోరాటి శ్రీనివాస్, చీకట్ల గంగరాజు, పిల్లా సూరిబాబు రంగా సేవలను కొనియాడారు. దళిత నాయకుడు పాలింగి కృష్ణ కిశోర్, సలాది వీరబాబు, వంగా నల్ల శ్రీను, పాలింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఏడిద సీతానగరంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట

రంగా విగ్రహాల ఆవిష్కరణ

కపిలేశ్వరపురం: మండపేట మండలం ఏడిద సీతానగరంలో శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన రంగా విగ్రహాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఆంధ్ర, తెలంగాణ రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రసన్న పూర్ణ చంద్రరావు చేతులు మీదుగా ఆవిష్కరించారు. పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం మండలం నారాయణలంకలో రంగా విగ్రహాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, గంధం పల్లంరాజు ఆవిష్కరించారు. కడియం మండలం మాధవరాయుడు పాలెంలో అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని వంగవీటి నరేంద్రతో కలిసి ఎమ్మెల్సీ తోట ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామన ప్రభాకరరావు, జిన్నూరు సాయిబాబు, ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, సాధనాల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని రంగా మిత్రమండలి, కాపు యూత్ ఆధ్వర్యంలో వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాపునాడు అధ్యక్షుడు నున్న వెంకటరమణ, గరగ శ్రీనివాసరావు, మేడిశెట్టి నాగయ్య, శాకా పెద్ద చోడియ్య, నిమ్మకాయల సాయిరామ్‌ప్రసాద్, గరగ తాతారావు, నున్న ఈశ్వరుడు, శాకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అంగర గాంధీ సెంటర్‌లో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


గొల్లపాలెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

జగన్నాథగిరిలో..

కాజులూరు: అల్లూరి సీతారామరాజు ఆశయాలు యువత ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం పార్లమెంటరీ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అల్లూరి జయంతిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

గొల్లపాలెంలో..

కాజులూరు: దివంగత నేత వంగవీటి ఆశయ సాధనకు నేటి తరం నాయకులు పాటుపడాలని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి, కాజులూరు తెలగా కాపు సంఘం నిర్వాహకుడు యాళ్ల సత్తిబాబు అన్నారు. వంగవీటి రంగా జయంతి సందర్భంగా కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొల్లపాలెం మార్కెట్ జంక్షన్‌లో గొల్లపల్లి చిన్నా ఆధ్వర్యంలో దేగల సతీష్, ఏరుబండి నాని, శాఖా శ్రీరామ్ తదితర నాయకులు రంగా పుట్టినరోజు కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

రోశయ్య రాజనీతి నేటి తరానికి ఆదర్శం

కపిలేశ్వరపురం (మండపేట): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య రాజనీతి నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా శుక్రవారం మండపేట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మయూరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేతగా రోశయ్య రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళ్ళకూరి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల గుప్తా, పిఆర్‌ఓ నాళం కిట్టు, ఉపాధ్యక్షుడు కంచర్ల ప్రసాద్, వాసవి సేవాదళ్ చైర్మన్ కేశవరపు శ్రీనివాస్, మద్దుల సుబ్బారావు, నాయకులు వాకచర్ల నాగబాబు, చామర్తి లావరాజు పాల్గొన్నారు.


మండపేటలో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కాజులూరు: మండలంలోని కోలంకలో రాష్ట్ర మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను స్థానికులు ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు వరదా శేషారావు, కార్యదర్శి బలభద్రుని మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి పంచారు.

పాపారావు అక్రమ అరెస్ట్‌ను బహిర్గతం చేయాలి

రామచంద్రపురం: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ పాపారావు అక్రమ అరెస్ట్‌ను కూటమి ప్రభుత్వం బహిర్గతం చేయాలని పలువురు నాయకులు కోరారు. ఆయనను వెంటనే కోర్టులో హాజరు పరచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీవైఎల్ నాయకుడు చింతా రాజారెడ్డి, అబంటి కృష్ణలు డిమాండ్ చేశారు. పీడిత, తాడిత ప్రజల పక్షాన 40 ఏళ్లుగా పోరాటాలు చేసిన పాపారావు ప్రాణాలకు హాని తలపెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భార్య రజియా తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని, ఆయన ఆరోగ్యం కూడా ఇటీవల సరిగా లేదని అన్నారు. పాపారావు కుటుంబ సభ్యులకు ఆయన అరెస్ట్ సమాచారాన్ని తెలియజేయాలని, కోర్టులో హాజరు పరచాలని కోరుతున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శుక్రవారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్ స్టేషన్ వల్లూరు ఫీడర్ పరిధిలోని ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.